# వలయం

**కథానిక**

**టి. ప్రసన్నకుమార్**

నరేంద్రకు కొడుకు పుట్టాడు. అసలు తన భార్య కడుపుతో వున్న దగ్గర్నుంచి అందరికీ కొడుకే పుడతాడని చెపుతూ వచ్చాడు. కొంతమందితో పందెం కాసాడు కూడా! ఎవరయినా "ఆడపిల్ల పుడితే, ఏం చేస్తావోయ్" అంటే, కాసేపు ఉడుక్కని తనకు మగపిల్లాడే ఎందుకు పుడతాడో వివరించే వాడు. అటు మామగారి వైపు తన భార్య తప్ప వేరే ఆడపిల్లలు లేరట, ఇటు తన వైపు వాళ్ళమ్మకు వరసగా అయిదుగురూ మగపిల్లలేనట, తన అన్నలందరికీ తొలి చూలు కొడుకులేనట. "మరి నాకు మాత్రం ఆడపిల్ల ఎలా పుడుతుందండీ" అని ఎదురు అడిగేవాడు. అలా ముందునుంచి అనుకున్నట్టు మగపిల్లాడు పుట్టటంతో అతనికి ఆనందం రెట్టింపయ్యింది. ఆ జోరులో ఆఫీసులో అందరికీ మందు పార్టీ ప్రామిస్ చేసాడు. దాంతో కొలీగ్స్ కూడా సంతోషించారు అతనికి కొడుకే పుట్టినందుకు!

నరేంద్రకు రెక్కలుగట్టుకుని కొడుకు దగ్గర వాలాలనిపించింది. అయితే అందుకు అంతరాయం కలిగిస్తూ మామగారి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది – పిల్లాడు పుట్టిన నక్షత్రం ప్రకారం తండ్రి వెంటనే చూసేందుకు వీలు లేదనీ, పదకొండో రోజు 'శాంతి', 'శుద్ధిపుణ్యాచనం' అవీ అయేంత వరకూ ఆగాలనీ. వెధవాచారాలూ వీళ్ళునూ అని కాస్సేపు తిట్టుకున్నాడు. ఎప్పుడు లీవు పెట్టి రమ్మని వ్రాసారో చూసుకుని శెలవు చీటి వ్రాసి పంపించాడు.

మామగారి ఊరొచ్చాడు నరేంద్ర. పిల్లాడ్నయితే ఏదో తతంగం అదీ అయేంత వరకూ ఎలాగూ చూపించరు. పెళ్ళాన్నయినా చూసి తనివితీరా కబుర్లు చెబుదామనుకున్నాడు. కానీ పిల్లాడి దగ్గరే ఆ అమ్మాయి వుండడంవల్ల కుదిరింది కాదు. వుసూరుమంది ప్రాణం. గత్యంతరం లేక మామగారితో మాటలు మొదలు పెట్టాడు.

"అమ్మగారు రానే లేదు." నిష్ఠూరంతో ప్రారంభించాడు మామగారు. "అబ్బే వద్దామనే అనుకుంది కానీ ప్రయాణం కష్టం అని మానుకుంది. ఈ మధ్య తన ఆరోగ్యం అంతగా బావుంటం లేదు కూడా. ఎలాగూ మూడో నెల్లో రానే వస్తాడు కదా మనవడు అని ఊరుకుంది" అంటూ సర్దిచెప్పాడు నరేంద్ర. "మనవడి కోసం ఆ మాత్రం కష్టపడకపోతే ఎలా? మాకు మాత్రం ఓపికలున్నాయా?" సాగదీసాడు మామగారు.

"ఇంతకీ బారసాల ఎక్కడ చేస్తున్నారు. మన ఇల్లు చిన్నది కదా. భోజనాలూ అవీ కుదరుతయా?" అంటూ మాట మార్చేసాడు.

"అన్నట్టు చెప్పనే లేదు కదూ మీకు? ఈ మధ్య మనవాళ్ళం అంతా కలిసి సత్రం కట్టించాం ఇక్కడ. బాగా పెద్దదే. మీ మద్రాసు చవుల్ట్రీ లంత ఉంటుంది. దాంట్లోనే ఒక ప్రక్కగా అమ్మవారి గుడీ, వెనకవైపు గొడౌన్లు ఉన్నాయి. ఇప్పటిదాకా నాలుగు లక్షలయింది.

ఇంకా కొన్ని గొడౌన్లు పూర్తి కానే లేదు'' అంటూ గర్వంగా చెప్పాడు. "వ్హాట్? నాలుగు లక్షలయిందా'' ఆశ్చర్యపో యాడు నరేంద్ర. "ఆ మిగతా గొడౌన్లు పూర్తయ్యేసరికి అయిదు లక్షలూ పూర్త వుతుందనుకుంటా. ''

యాభైవేలైనా లేని ఊళ్లో అయిదు లక్షలు పెట్టి సత్రమా అని ఆశ్చర్య పోయాడు నరేంద్ర. అదే మాట పైకి అన్నాడు. వాళ్ళ మామ గారు నొచ్చు కుని "అదేమిటల్లుడు గారూ అలాగం టారు? మొన్నకి మొన్న మీ పెళ్ళికి ఎంత కష్టం అయ్యింది మాకు. ఒకరింట్లో విడిది. ఒకరింట్లో భోజనాలు. మా ఇంట్లో పెళ్ళి. పిల్లి తిరిగినట్లు తిరిగాం కదా ఇల్లిల్లూ. అందరిళ్ళల్లోనూ అదే కష్టం. అందరు పూనుకొని ఈ సత్రం కట్టిం చాం. ఇప్పుడెంత హాయి ప్రాణానికి'' అంటూ సత్రం ఎంతవసరమో ఇంకా కొంచంసేపు ఏకరవు పెట్టాడు. ఆయ నతో వాదించటం ఎందుకని మౌనంగా ఉండి పోయాడు నరేంద్ర.

ఆ రోజే ప్రొద్దున శుద్ధి పుణ్యాచనం. బారసాల. సాయంత్రం రాత్రి అమ్మవారి పూజ. అన్నీ కొత్తగా కట్టిన సత్రంలోనే ఏర్పాటు చేసారు. సత్రమంతా హడా వుడిగా ఉంది. చిన్న ఊరేమో, పిల్చిన ఇళ్లల్లో మొత్తం అంత మందీ వచ్చారు, వెళ్ళకపోతే బావుండదని. ఎవరయినా రాకపోతే మళ్ళీకబురు పంపిస్తున్నారు, భోజనానికయినా తప్పక రమ్మని. దాదాపు పెళ్ళికి జరిగే హడావిడి జరుగు తోంది. పిల్లవాడి సారె అంటూ బంగారువి గొలుసు, మొలతాడు, మురు గులు, కడియాలు, ఉంగరం ఇచ్చారు. వెండివి ఉగ్గు గిన్నె, పాల చెంబు, పౌడరు డబ్బా, చిన్న కంచం, ఇంకా దుప్పట్లు, తువ్వాళ్ళు, దిండ్లు, సోపులు, చిన్న పక్క, ఉయ్యాల గుడ్డలూ చాలానే చదివించారు నరేంద్ర మామ గారు.

మామూలుగా "అక్కర్లేని ఆచారాలు, ఆడంబరాలున్నూ. డబ్బు దండక్క తప్ప ఎందుకూ పనికి రావు'' అనేవాడు, నరేంద్ర ఇలాటివి చూసినప్పుడు. కానీ ఇప్పుడు మామగారిచ్చిన సామాను చూస్తుంటే తెలియకుండానే అతని పెద వుల మీదకు చిరునవ్వు వచ్చింది. అందులో గర్వం తృప్తి రెండూ ఉన్నాయి. తన్మయంగా చూసుకుంటు న్నాడు సారెను.

"ఇంత మందికి ఎడుతుండావ్ మాకో ముద్ద తక్కువ్వద్దా సామి ముష్టోల్లం, ఇంత పడెయ్యి బాబు. మీ పిల్లా, పాప చల్లగుండాల'' – ఎవరో ముష్టి వాళ్ళు సత్రం బయట నుంచి అరుస్తున్నారు. వాళ్ళను పొమ్మంటూ నరేంద్ర మామ గారు గట్టిగా అరు స్తున్నారు. వాళ్ళు పోకుండా లోపల విస్తళ్ళల్లో జరిగే వడ్డన వైపు ఆశగా చూస్తూ బతిమిలాడుతున్నారు. పొమ్మంటే మీక్కాదూ. "ఎందుకలా నిల్చుంటారు దిష్టి బొమ్మల్లా. పోండి పోండి'' కసురుకొన్నాడు.

"తలో ముద్దా ఎయ్యి బాబయ్యా పోతం.''

"ఏమిటింత జబర్దస్తీగా అడుగు తున్నారు. మీ అబ్బ సొమ్మేమన్నా దాచారా ఏం. తలో ముద్దా వెయ్యా లంట. ఇలా అడిగి నోళ్ళందరకూ పెడుతూ ఉంటే అయినట్టే, పోండి పోండి.'' విసుక్కున్నాడు నరేంద్ర మామ గారు.

" అబ్బ సొమ్మేంది. మా సొమ్మే

దాచాం. మాలాటోల్ల ఎంత మంది నోళ్ళు కొట్టందే కూడబెట్టావ్ ఇంత ముద నట్టం?'' కడుపు మండిందొకడికి.

ఆ మాటకు వళ్ళు తెలియని కోపం వచ్చింది నరేంద్ర మామ గారికి. వాణ్ని నానా మాటలూ అని, కర్ర తీసుకొని బాద బాదాడు. మిగతా ముష్టోళ్ళు ప్రక్కకు తప్పుకుని చూస్తూ నిలబడ్డారే గానీ ఆయన్ని ఆపే సాహసం చెయ్యలేదు.

''ఛీ ఛీ ముష్టి వెధవలూ, ముష్టి మా లోకం. నీతా జాతా ముండాకొడుకులికి? అలా కుళ్ళి చస్తారు కాబట్టే అడుక్కు తింటున్నారు.'' తిట్టుకుంటూ లోపలకు వెళ్ళి పోయారు అంతవరకూ చోద్యం చూసిన వాళ్ళంతా

ఆ రాత్రి గుళ్ళో పూజకు హడావుడి పడ్తోంది నరేంద్ర అత్త గారు. ఆవిడ నూటొక్క కొబ్బరి కాయలు కొడతానని మొక్కుకుందట కాన్పు కష్టం అయితే. అవింకా రాలేదని భర్తమీద విసుక్కుం టోంది. ''పీకల మీద కొచ్చేదాకా ఏ పనీ చెయ్య''రంటూ. గుమాస్తా వచ్చి చెప్పాడు. కొబ్బరికాయలు తీస్తా ఉంటే కొన్ని క్రింద పడి దొర్లి పోయాయంట. వాటిని దొరక పుచ్చుకుని ఇద్దరు ముష్టోళ్ళు పరుగెత్తుకుని వెళ్ళిపోయారట. అలా కొరత బడ్డ కాయల్ని తిరిగి తీసు కొచ్చేసరికి ఆలస్యం అయిందట.

ఇదంతా విన్న వాళ్ళు ''అలా దొంగ బుద్ధుల్తో చస్తారు కాబట్టే అలాగున్నారు. దేవుడి సొమ్ము దొంగిలిస్తే బాగు పడతారా ఈలాంటోళ్ళు? ఇంకా పది జన్మ లెత్తినా అడుక్కు తింటూనే వుంటారు.'' అని మరోసారి తిట్టు.

అంతా సుష్టుగా భోంచేసి మంచాల మీద కూర్చున్నారు, భుక్తాయాసంతో. వాళ్ళతో వీళ్ళతో కాసేపు కబుర్లాడి తన గదిలోకి వెళ్ళి పోయాడు నరేంద్ర. పడక కుర్చీలో కూర్చొని అబ్బాయి పేరుతో ఎన్ని వేలకు ఇన్స్యూర్ చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. కొడుకు అప్పుడే పెరిగిపోయి పెద్ద డాక్టరై పోయినట్లు, పెద్ద పెద్ద కార్లల్లో తిరుగుతున్నట్లు కలలు కంటున్నాడు.

''బావా . . . బావా''. ఎవరో చిన్న పిల్ల అతని వేలు పట్టి కదుపుతూంటే లోకంలోకి వచ్చాడు.

''నువ్వా రాణీ! ఏం ఇలా వచ్చావ్'' అంటూ పలకరించాడు. ''బావా నీకు తెలుగు చదవటం వ్రాయటం వచ్చా?'' కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అడిగింది.

నవ్వొచ్చింది నరేంద్రకు. మద్రాసు వాళ్ళంటే వాళ్ళ కసలు తెలుగురాదను కుంటారు చాలామంది. బహుశా ఈ పిల్లకూడా అలాగే అనుకుని వుండొచ్చు.

''ఎందుకు రాదూ? వచ్చమ్మా'' అన్నాడు.

''అయితే ఇది చదువు చూద్దాం.'' పక్కనే ఉన్న తెలుగు పత్రికలో ఒక పేజీ తీసి ఒకచోట వేలు పెట్టి, ఒక వాక్యం చూపించింది. చదివాడు. ''మతమూ - దరిద్రమూ ఒకే నాణానికి వున్న రెండు వైపులు లాంటివి. ఒకటి పోతే రెండోది దానంతటదే పోతుంది. శ్రీశ్రీ.''

ఎవరో వీపుమీద చళ్ళున చరిచి నట్ల యింది. ఉలిక్కి పడ్డాడు నరేంద్ర. అతని కళ్ళముందు, లక్షలు పెట్టికట్టిన సత్రమూ, మామ గారు పెట్టిన సారె, కొబ్బరి కాయలు, భార్య వేసుకొన్న నగలూ ఒకటి తరువాత ఒకటి గిర్రున తిరిగాయి వలయంలా. దెబ్బలు తిన్న ముష్టివాడు దూరంగా నిలబడి ఆ వల యం వైపు కాసేపు దీనంగా, కాసేపు కోపంగా చూస్తున్నట్టనిపించింది!